సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 9 । జనవరి । 2024

29న చలో ఇందిరాపార్క్

ఆదిలాబాద్‌రూరల్: షెడ్యూల్డు ప్రాంత ఉ ద్యోగాలను ఐటీడీఏల ద్వారానే భర్తీ చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ఆదివాసీ నిరుద్యోగ గోస ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

‘ఓపెన్’ ప్రవేశాలకు 11 వరకు గడువు

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి జిల్లా పరిధిలోని ఓపెన్ స్కూల్ దూర విద్య విధానంలో టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం ఈనెల 11 వరకు గడువు ఉందని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకో వాలని పేర్కొన్నారు. వివరాల కోసం అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
29.0/18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

రూ.50 కోట్ల నిధులు విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తూ..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణాభివృద్ధి కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 కోట్ల నిధులు వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ రాహుల్ రాజ్‌ను ప్రజావాణిలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణవాసుల ఇబ్బందులు దూరం చేయడం, మౌలిక వసతులను కల్పించాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం టీయూఎఫ్‌ఐడీసీ కింద రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ కూడా దీనిపై దృష్టి సారించాలని కోరారు. అవసరమైతే కోర్టును సైతం ఆశ్రయిస్తామన్నారు. చైర్మన్ వెంట కౌన్సిలర్ వెంకన్న నాయకులు ఇమ్రాన్, మిషు, భూమన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పంపిణీ షురూ



ఈకేవైసీ నమోదు పరిశీలిస్తున్న డీఎస్‌వో

కైలాస్‌నగర్: చౌక దుకాణాల ద్వారా అందించే ఉచిత రేషన్ బియ్యం జనవరి కోటా పంపిణీ ప్రక్రియ జిల్లాలో సోమవారం ప్రారంభమైంది. ప్రతి నెలా 5వ తేదీ నుంచే బియ్యం పంపిణీ జరుగుతుండగా రాష్ట్రస్థాయిలో పీవోఎస్ మిషన్ల సర్వర్‌లో తలెత్తిన సమస్య కారణంగా ఈనెల బియ్యం పంపిణీలో జాప్యం ఏర్పడింది. రాష్ట్రస్థాయిలో సర్వర్ తెరుచుకోవడంతో జిల్లాలో డీలర్లు బియ్యం పంపిణీని ప్రారంభించారు. కాగా, ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టర్‌చౌక్‌లో గల రేషన్‌షాపును డీఎస్‌వో కిరణ్‌కుమార్ పరిశీలించారు. బియ్యం పంపిణీపై ఆరా తీశారు. ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆధార్ వివరాలు నమోదు కాని సభ్యుల ఐరిస్ సేకరించాలని డీలర్‌ను ఆదేశించారు.

కుష్ఠు రోగులను ప్రతీ నెల పరీక్షించాలి



మాట్లాడుతున్న డాక్టర్ గజానన్

ఆదిలాబాద్‌టౌన్: ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని కుష్ఠు రోగులను ప్రతీ నెల పరీక్షించాలని జిల్లా కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ గజానన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పుత్లీబౌళి పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుష్ఠు రోగులు క్రమం తప్పకుండా ఎండీటీ చికిత్స తీసుకునేలా చూడాలిసిన బాధ్యత ఆశ కార్యకర్తలపై ఉందన్నారు. వ్యాధి అనుమానితులను గుర్తించి ఆస్పత్రికి పంపించాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారి అస్పియా ఫాతిమా, డిప్యూటీ పారామెడికల్ అధికారి వామన్‌రావ్, సీవో నవీన్, స్టాఫ్ నర్సులు నీల, సుజాత, ఇర్ఫా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యూహరచన



- లోక్‌సభ ఎన్నికలకు పార్టీలు సన్నద్ధం
- ‘ఆదిలాబాద్’ గెలుపే లక్ష్యంగా పావులు
- కాంగ్రెస్, బీజేపీ ఇన్‌చార్జీల నియామకం
- ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరం

సాక్షి, ఆదిలాబాద్: లోక్‌సభ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. గెలుపే లక్ష్యంగా వ్యూహ రచన చేస్తున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఈ ఎన్నికల కోసం రాష్ట్ర రాజధానిలో పలు సమావేశాలు నిర్వహించాయి. ఇందులో భాగంగా కాంగ్రెస్, బీజేపీలకు సంబంధించి పార్లమెంట్ ఇన్‌చార్జీలను ఆయా పార్టీల అధిష్టానాలు ఖరారు చేశాయి. బీఆర్‌ఎస్‌కు సంబంధించి ఎవరనేది ఇంకా ఫైనల్ కాలేదు.

ఇన్‌చార్జీలు వీరే..

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని ఆయా స్థానాలకు కాంగ్రెస్ కోఆర్డినేటర్లను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆదివారం నియమించారు. ఆదిలాబాద్ పార్లమెంట్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను ఖరారు చేశారు. ఇక బీజేపీకి సంబంధించి లోక్‌సభ పొలిటికల్ ఇన్‌చార్జీలను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. ఆదిలాబాద్ పార్లమెంట్‌కు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను ఖరారు చేశారు. వీరి ఆధ్వర్యంలోనే ఆయా పార్టీలు ఈ ఎన్నికల్లో ముందుకెళ్లనున్నాయి. కాగా బీఆర్‌ఎస్‌కు సంబంధించి ఇటీవల హైదరాబాద్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. అయితే ఆ పార్టీ పరంగా ఇన్‌చార్జి నియామకం జరగలేదు.

ఆశావహుల యత్నాలు ముమ్మరం..

ఆయా పార్టీల నుంచి పోటీ చేసేందుకు ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఇప్పటికైతే నరేష్ జాదవ్ పేరు వినిపిస్తుండగా, ఆదివాసీ నాయకులకు కూడా అవకాశం ఉటుందని చెప్పడంతో పలువురు ఈ పార్టీ నుంచి పోటీ చేసేందుకు తమవంతు యత్నాలు చేస్తున్నారు. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీలకే ఆ పార్టీ టికెట్ అని కేంద్ర హోంమంత్రి ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో పేర్కొనడం గమనార్హం.

కీలక బాధ్యత..

లోక్‌సభ ఎన్నికల కోసం ప్రధాన పార్టీలు ఇప్పటికే ఇన్‌చార్జీలను నియమించి గెలుపు బాధ్యత వారికి అప్పగించాయి. కాంగ్రెస్ కోఆర్డినేటర్ సీతక్క ఈ నియోజకవర్గంలో విజయం కోసం తీవ్రంగా కృషి చేయాల్సిన పరిస్థితి ఉంది. దీనికి కారణం లేకపోలేదు. ఈ సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో నాలుగు చోట్ల ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్‌లో బీజేపీ గెలుపొందగా, బోథ్, ఆసిఫాబాద్‌లో బీఆర్‌ఎస్ విజయం సాధించింది. ఒకే ఒక ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాల్సిన పరిస్థితి. ఇక బీజేపీ పరంగా ఆదిలాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు. అలాగే బీజేపీ ఎమ్మెల్యేలు నిర్మల్‌కు చెందిన ఏలేటి మహేశ్వర్ రెడ్డికి నిజామాబాద్ నియోజకవర్గం, ముథోల్‌కు చెందిన రామారావు పటేల్‌కు పెద్దపల్లి నియోజకవర్గం, సిర్పూర్‌కు చెందిన పాల్వాయి హరీశ్‌బాబుకు మెదక్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఈ ఏడు ని యోజకవర్గాల్లో బీజేపీ నేతలు, శ్రేణులను సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత శంకర్‌పై ఉంది.

అమాయకులే టార్గెట్

- సిరికొండలో నోట్ల రెట్టింపు ఆశ చూపి..
- ఆదిలాబాద్‌లో ఇత్తడి నాణేలకు బంగారం పూత
- మోసాలకు పాల్పడుతున్న కేటుగాళ్లు



ఇచ్చోడలో నకిలీ కరెన్సీ తయారు చేసే ముఠాను అరెస్టు చేసిన పోలీసులు (ఫైల్)



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు పూత పూసిన ఇత్తడి నాణేలు

ఆదిలాబాద్‌టౌన్: మోసపోయేవారు ఉంటే మోసం చేసేవారికి కొదువ లేకుండా పోతోంది. అమాయకులే టార్గెట్‌గా దోపిడీ చేసేందుకు కేటుగాళ్లు రెచ్చిపోతూనే ఉన్నారు. కొంత మంది ఉద్యోగాలు ఇప్పిస్తామని, మరికొంత మంది డబ్బులిస్తే రెట్టింపు చేసిస్తామని ఆశచూపడం, తాజాగా ఇత్తడి నాణేలకు బంగారపు పూత పూసి అంటగట్టేందుకు యత్నించగా వారిని పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలో రోజురోజుకు వీరి ఆగడాలు మితిమీరుతున్నాయి. అప్రమత్తంగా లేకపోతే నష్టపోయే ప్రమాదం ఉందని పోలీసులు చెబుతున్నారు.

బంగారు నాణేల పేరిట బురిడీ..

ఇత్తడి నాణేలకు బంగారు పూత పూసి అమాయకులకు అంటగట్టేందుకు ముగ్గురు మోసగాళ్లు ఆదిలాబాద్ పట్టణంలో ఆదివారం యత్నించారు. వీరి ఆగడాలను గ్రహించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని అరెస్టు చేశారు. ముగ్గురు దుండగులు ఈ మోసానికి పాల్పడగా, నార్నూర్ మండలం పూనగూడకు చెందిన సోయం మాన్కును అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. వీరు మహారాష్ట్రలో ఇత్తడి నాణేలకు బంగారు పూత పూయించారు. 102 నాణేలను విక్రయించేందుకు యత్నించారు. ఒక్కో నాణేం గ్రాము బరువు ఉంది. ప్రస్తుతం పది గ్రాముల బంగారానికి రూ.60వేలు దాటగా వీరు పది గ్రాములకు రూ.40వేల నుంచి రూ.50 వేలతో అమ్మేందుకు యత్నించారు. పట్టణంలోని శ్రీనివాస లాడ్జి వద్ద పలువురితో ఈ బేరసారాలు నడపగా, వారికి అనుమానంవచ్చి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఇద్దరిని ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ముజ్జు, రమేశ్‌గా గుర్తించారు.

బ్లాంకెట్లు అమ్మడానికి వచ్చి..

ఇటీవల సిరికొండ మండలం రాజంపేటలో మధ్యప్రదేశ్‌కు చెందిన నలుగురు వ్యక్తులు బ్లాంకెట్లు అమ్మడానికి వెళ్లారు. ఓ ఆదివాసీ ఇంటికి వెళ్లి మచ్చిక చేసుకున్నారు. వారు తమకు సంతానం లేదని చెప్పగా, తాముమందు ఇస్తామని మాయమాటలు చెప్పి నమ్మించారు. సంతానంతో పాటు ధనలక్ష్మి కూడా ఉండాలని పేర్కొన్నారు. ఇందుకు కొంత డబ్బు ఇస్తే వాటిని రెట్టింపు చేసిస్తామని, దాంతో ఉన్నతంగా బతకవచ్చని తెలిపారు. తాము ఇచ్చోడలో ఉంటామని, వచ్చి కలవాలని చెప్పారు. దీంతో వారు మరుసటి రోజు రూ.3లక్షలు తీసుకొని వెళ్లి వారికి అందజేశారు. రూ.3లక్షలకు కోటి వరకు డబ్బులు రెట్టింపు చేసి ఇస్తామని నమ్మించారు. అయితే ప్రస్తుతం ఆ మిషన్ తమ వద్ద లేదని, రెండు రోజులు ఆగాలని చెప్పారు. డబ్బులు ఇచ్చిన తర్వాత మోసపోయామని తెలియడంతో బాధితులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. అలాగే ఆదిలాబాద్ పట్టణం భుక్తాపూర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి అటవీ శాఖలో ఉద్యోగం చేస్తూ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఆ తర్వాత హైదరాబాద్‌లో ప్రజలను మోసం చేసేందుకు పన్నాగం పన్నాడు. పిల్లలు ఆడుకునే నకిలీ నోట్లతో మోసం చేసేందుకు యత్నించగా హైదరాబాద్ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేకంగా చోటుచేసుకుంటున్నాయి.

నమ్మి మోసపోవద్దు..

గుర్తింపు ఉన్న షాపుల్లోనే వస్తువులు కొనుగోలు చేయాలి. వాటికి సంబంధించి రశీదు తప్పనిసరిగా పొందాలి. మోసగాళ్లు ఇంటివద్దకు వచ్చి బంగారు ఆభరణాలు, ఇతరత్రావి విక్రయించేందుకు యత్నిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. ఎవరు కూడా మోసగాళ్ల ఉచ్చులో పడకూడదు. లేకుంటే మోసపోయిన తర్వాత బాధపడాల్సి వస్తుంది.

– సత్యనారాయణ, వన్‌టౌన్ సీఐ, ఆదిలాబాద్

ని‘వేదనలు..’



సమస్యలను ఆలకిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- ప్రజావాణికి వినతుల వెల్లువ
- గంటన్నర పాటు అర్జీదారుల నిరీక్షణ

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణికి ఈ వారం వినతులు వెల్లువెత్తాయి. తమ ఆవేదనను ఉన్నతాధికారులకు నివేదించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, ఖుష్బూగుప్తాతో కలిసి కలెక్టర్ రాహుల్‌రాజ్ అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు అందజేస్తూ పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. పెండింగ్‌లో ఉంచొద్దన్నారు. అలాగే గ్రీవెన్స్‌కు జిల్లాస్థాయి అధికారులంతా తప్పనిసరిగా హాజరువాలన్నారు. కాగా అర్జీల స్వీకరణ సమయంలో కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించడంతో బాధితులు గంటన్నర పాటు బయటే ఇబ్బందులు పడుతూ నిరీక్షించాల్సి వచ్చింది. అర్జీల స్వీకరణ సమయంలో సమావేశాల నిర్వహణ ఏంటంటూ పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వారం అందిన అర్జీల్లో అత్యధికంగా ఆసరా పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, స్వయం ఉపాధి కల్పన, రుణాల మంజూరు వంటివి ఉన్నాయి. బాధితుల్లో కొందరి నివేదన వారి మాటల్లోనే..

అనుమతి లేదని కూల్చేశారు



సర్వేనంబర్ 170లోని ప్లాట్ నంబర్ 428లో రేకుల ఇల్లు నిర్మించుకున్న. గ్రామ పంచాయతీలో ట్యాక్స్ కూడా కట్టిన. కానీ ఇంటికి బల్దియా నుంచి అనుమతి లేదనే కారణంతో మున్సిపల్ అధికారులు నా ఇంటిని కూల్చివేశారు. ఎన్నో ఇళ్లు అనుమతి లేకుండా నిర్మించినవి ఉన్నప్పటికి కేవలం నా ఒక్క ఇంటిని మాత్రమే కూల్చివేసి నష్టం చేశారు. దీనిపై విచారించి నాకు న్యాయం చేయాలి.

– బత్తుల రాములు, మావల

బోర్లకు అడ్డుపడుతున్నరు



మేమంతా ఆదివాసీ గిరిజన రైతులం. గిరి వికాసం పథకం కింద మా వ్యవసాయ భూములకు బోరు బావి, త్రీఫేజ్ విద్యుత్ మంజూరైంది. కరెంట్ సౌకర్యం కల్పించగా.. బోరు బావులు వేసుకుందామంటే అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నరు. గ్రామంలోకి మిషన్లను రాకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నరు. బోరు బావుల తవ్వకానికి అనుమతిచ్చి యాసంగి పంటల సాగుకు అవకాశం కల్పించాలని కోరుతున్నాం.

– గిరిజై గ్రామస్తులు, బజార్‌హత్నూర్

రెండేళ్లుగా వేతనాల్లేవ్..

మేమంతా జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 15 ఏళ్లుగా ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్నాం. వేతనాలు తక్కువే అయినా మా పిల్లలనే ఉద్దేశంతో బాధ్యతగా సేవలందిస్తున్నాం. అలాంటి మాకు రెండేళ్లుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించట్లేదు. ఏఎన్‌ఎం పోస్టుల భర్తీ కోసం ఇటీవల చేపట్టిన నియామక ప్రక్రియలోఎంపికయ్యాం. కానీ కొంతమంది కోర్టుకు వెళ్లడంతో మమ్మల్ని విధులకు రావద్దని అధికారులు చెబు తున్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోగా ఉపాధి దూరం చేసే పరిస్థితి నెలకొంది. మమ్మల్ని యథావిధిగా కొనసాగిస్తూ వేతనాలు చెల్లించాలి.

– ఆశ్రమ పాఠశాలల ఏఎన్‌ఎంలు



పట్టా చేయడం లేదు



నా భర్త గుండెన ఎల్లన్న పేరిట ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్‌లో గల సర్వేనంబర్ 47/2/9లో 1.12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆయన చనిపోవడంతో ఆ భూమిని నా పేరిట పట్టా చేసి ఇవ్వాలని తహసీల్దార్‌కు దరఖాస్తు పెట్టిన. ఐదేళ్లుగా ఆఫీస్ చుట్టూ నా నలుగురు బిడ్డలతో కలిసి తిరుగుతూనే ఉన్నా. అయినా అధికారులెవరు కనికరించట్లేదు. దయచేసి విచారణ జరిపించి నా పేరిట పట్టా చేసి ఆదుకోవాలని కోరుతున్నా.

– గుండెన రాంబాయి, ఆదిలాబాద్

షెడ్లు కేటాయించాలి

మేమంతా చిరు వ్యాపారులం. పట్టణంలోని రోడ్లపై వివిధ వ్యాపారాలతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. పట్టణంలోని డైట్ కళాశాల వద్ద గల షెడ్లను మేము ఏర్పాటు చేసుకుంటే మున్సిపల్ అధికారులు ఇటీవల తొలగించారు. దీంతో ఉపాధికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. బల్దియా నిర్మించే షెడ్లను కేటాయించి ఆదుకోవాలని కలెక్టర్‌కు విన్నవించాం.

– చిరు వ్యాపారులు, ఆదిలాబాద్



పకడ్బందీగా దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రజాపాలన దరఖాస్తుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేస్తున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దరఖాస్తులోని అన్ని వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ఇప్పటికే ఆపరేటర్లకు అవగాహన కల్పించామని చెప్పారు. ఈ నెల 6 నుంచి అధికారుల పర్యవేక్షణలో అభయహస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రారంభించామన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 17 లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి, డీఎస్‌వో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికల నివేదికలందించాలి

కైలాస్‌నగర్: విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, సంక్షేమ, ఇంజినీరింగ్ శాఖలు ఈ ఏడాదిలో చేపట్టే పనులపై ముందస్తు ప్రణాళికలు రూపొందించి వాటి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీశాఖ అధికారి నిబద్ధతతో పనిచేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశ్రమల శాఖ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు అర్హులైన వారిని సబ్సిడీ రుణాలకు ఎంపిక చేసి మంజూరు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూగుప్తా, శ్యామలాదేవి, డీఆర్డీవో కిషన్, ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ శైలజ, మైనార్టీ సంక్షేమ అధికారి రాథోడ్ రమేశ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సీఎం ఫోకస్

- ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలతో సమీక్ష
- ఈ నెల 26 తర్వాత ఇంద్రవెల్లి పర్యటన



సీఎం రేవంత్‌రెడ్డితో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సమీక్షా సమావేశాలను ఆదిలాబాద్ జిల్లా నుంచే శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు వినోద్, వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు, వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్, కూచాడి శ్రీహరిరావుతో సీఎం సోమవారం సమావేశమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో సమస్యలపై ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలను అడిగి తెలుసుకున్నారు. వారు కూడా తమ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల అభివృద్ధితో పాటు ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల సంక్షేమ ఫలాలు అర్హులైన వారికి అందించడమే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారించాలని ము ఖ్యమంత్రి వారికి దిశానిర్దేశం చేసినట్లుగా తెలిసింది. సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తానని భరోసా ఇచ్చినట్లు సమాచారం. కాగా సీఎం జిల్లాల పర్యటన ఈ నెల 26 నుంచి చేపట్టనున్నారని, తొలి పర్యటన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి నుంచే ప్రారంభం కానుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద చేపట్టనున్న అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నట్లుగా ఆయన వివరించారు.

క్లుప్తంగా

దుకాణాల తొలగింపుపై వివాదం



జేసీబీతో తొలగిస్తున్నారిలా...

భైంసా: బాసర బస్టాండ్ ప్రహరీ నిర్మాణంలో భాగంగా ఆనుకుని ఉన్న దుకాణాలను సోమవారం తొలగించారు. ఆ స్థలం పంచాయతీరాజ్‌కు చెందినదని కొందరు, ఆర్‌అండ్‌బీకి చెందినదని మరికొందరు దుకాణాల తొలగింపు పనులను అడ్డుకున్నారు. భైంసా డీఎం అమృత ప్రహరీ నిర్మాణ స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి దుకాణాల తొలగింపును ఒకరోజు వాయిదా వేశారు. ఈ స్థల వివాదంపై అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆర్టీసీ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా ప్రహరీ నిర్మిస్తామని డీఎం అమృత వెల్లడించారు.

రాష్ట్ర జట్టు కోచ్‌గా కబీర్‌దాస్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు, బ్యాడ్మింటన్ శిక్షకుడు రూపావత్ కబీర్ దాస్ తెలంగాణ పారా అథ్లెటిక్స్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించనున్నారు. గోవాలో మంగళవారం నుంచి జనవరి 14 వరకు జరగనున్న 22వ నేషనల్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2024 పోటీల్లో తెలంగాణ జట్టుకు ఆయనను కోచ్‌గా నియమిస్తూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జనరల్ సెక్రెటరీ టి.సంజీవయ్య నియామక పత్రాన్ని అందజేశారు.

వివేకానందుడి జయంతి ఘనంగా నిర్వహించాలి

నిర్మల్‌ఖిల్లా: వివేకానందుడి జయంతోత్సవాలను ఈ నెల 12న ఘనంగా నిర్వహించాలని రాజ శ్యామల పీఠం పీఠాధిపతి శ్రీ శివ రాజయోగి కృష్ణ స్వామి పిలుపునిచ్చారు. సోమవారం 'వ్యసన్ ముక్త్ భారత్ అభియాన్' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందుడి బోధనలు ప్రతి తరానికి ఆదర్శమేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నేత్రవైద్య నిపుణులు డాక్టర్ కృష్ణంరాజు, కత్రోజీ అశోక్, కట్ట నరసింహచారి, లలిత, రాధా, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ మేళాకు స్పందన

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఐటీఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన అప్రెంటీస్‌షిప్ మేళాకు అపూర్వ స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి 5 కంపెనీలు పాల్గొనగా ఉమ్మడి ఆదిలాబాద్ నుండి మొత్తం 86 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. రమేశ్ బాబు తెలిపారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకులపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రంలోని ఓ పాఠశాలపై దాడి చేయడంతో పాటు అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఏబీవీపీ నాయకులు అక్షయ్, మహేశ్, నిఖిల్, కార్తీక్, కిరణ్, శిరీష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థినిపై ప్రిన్సిపాల్ లైంగిక దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ సదరు ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని దాడి చేయడం జరిగిందన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం ఎప్పుడో?

- భూములు తీసుకుని ఐదేళ్లవుతున్నా ప్రారంభం కాని పనులు
- ఉపాధి లేక కూలీలుగా మారిన రైతులు
- తమ భూములు ఇవ్వాలని కోరుతున్న రేణుకా సిమెంట్ కంపెనీ నిర్వాసితులు



రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ స్థలం

ఆదిలాబాద్‌రూరల్: సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే తమకు, తమ పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఆ సమయంలో తక్కువ ధరకే వారి వ్యవసాయ భూములను విక్రయించారు. ఐదేళ్లు కావస్తున్నా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో ఉన్న భూమి కోల్పోయి ప్రస్తుతం ఎలాంటి ఉద్యోగావకాశాలు లేక కూలీలుగా మారారు.

107 ఎకరాల భూమి కొనుగోలు

ఆదిలాబాద్ రూరల్ మండలం రాంపూర్ శివారు ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం రాంపూర్, రామాయి, తదితర గ్రామాలకు చెందిన ఆదివాసీ, గిరిజనేతర రైతులు 42 మంది నుంచి 107 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. జీవో నంబర్ 40 ప్రకారం మూడేళ్లలో ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. నేటికీ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకపోవడంపై నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లలకు ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశతో ఉన్న భూమిని అప్పగించి ఉపాధి అవకాశాలు లేక కూలీలుగా మారామని వాపోతున్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టే వరకు తమ భూముల్లోకి తమని అనుమతించాలని కోరుతున్నారు.

ఎకరాకు రూ.9.25 లక్షలు

రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం రైతులు 2018లో ఎకరాకు రూ.9.25 లక్షల చొప్పున విక్రయించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలోని వ్యవసాయ భూమి ఎకరాకు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ధర పలుకుతోంది.

ముడి సరుకు కోసం భూమి అన్వేషణ

ఫ్యాక్టరీ నిర్మాణం కోసం 107 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన రేణుకా సిమెంట్ యాజమాన్యం సిమెంట్ తయారు కోసం కావాల్సిన సున్నపురాయి (ముడి సరుకు) కోసం భూమిని అన్వేషిస్తోంది. ఆ ప్రాంతాంలో సుమారు 600 ఎకరాల భూమి అవసరం ఉందని భావిస్తున్నారు. ఈ భూమి సేకరణలో జాప్యం జరగడంతోనే పనుల నిర్మాణం ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. మిగితా భూమి రైతులకు కావాల్సిన ధర యాజమాన్యం చెల్లించేందుకు వెనుకడుగు వేయడంతో రైతులు ఆభూమిని విక్రయించేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

గతంలో ఆందోళనలు

రేణుకా సిమెంట్ నిర్మాణ పనులు ప్రారంభించేలా ఫ్యాక్టరీ యాజమానికి ఆదేశాలు జారీ చేయాలని గతంలో నేషనల్ కమిషన్ ఆఫ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ సభ్యులను సైతం గిరిజన రైతులు కోరారు. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో తమ భూములు దున్నుకునేందుకు వెళ్లిన రైతులను పోలీసులు అడ్డుకుని కేసులు నమోదు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికీ తమ భూములు తమకు తిరిగి ఇస్తే సాగు చేసుకుంటామని, ఫ్యాక్టరీ నిర్మాణం చేసేటప్పుడు మళ్లీ అప్పగిస్తామని రైతులు పేర్కొంటున్నారు.

అధికారులు జోక్యం చేసుకోవాలి



భూములు కొనుగోలు చేసిన వ్యక్తి ఎవరో ఇప్పటికీ నిర్వాసితులకు తెలియదు. మధ్యవర్తుల ద్వారా ఒప్పందం కుదుర్చుకుని రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఇప్పటి వరకు పనులే ప్రారంభం కాలేదు. రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుంటేనే ఈ సమస్య పరిష్కరమవుతుంది.

– కొడప సోనేరావు, కొలాం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు

ఫ్యాక్టరీ నిర్మిస్తే వెళ్లిపోతాం



సిమెంట్ ఫ్యాక్టరీ కోసం ఐదెకరాల వ్యవసాయ భూమి ఇచ్చా. మూడేళ్లలో ఉద్యోగంతో పాటు ఇల్లు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. మా భూమి మాకు ఇస్తే ఫ్యాక్టరీ పనులు ప్రారంభించినప్పుడు వారికి భూములు తిరిగి ఇచ్చేస్తాం. అప్పటి వరకు పంటలు సాగు చేసుకుంటాం.

– కోట్నాక్ రాము, భూనిర్వాసితుడు, రాంపూర్

కారణాలు తెలుసుకుంటా..

మూడు నెలల కిందటే ఇక్కడికి తహసీల్దార్‌గా వచ్చా. రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతున్న విషయం నాకు తెలియదు. జాప్యం జరగడానికి కారణాలు ఏమిటో పూర్తిస్థాయిలో తెలుసుకుంటా.

– దిలీప్ కుమార్, తహసీల్దార్, ఆదిలాబాద్ రూరల్

సీఎం ఓఎస్‌డీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



పుష్పగుచ్ఛం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓఎస్‌డీగా నియమితులైన ఆదిలాబాద్ జిల్లావాసి గోపిడి చంద్రశేఖర్ రెడ్డిని సోమవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఆయన్ను కలిసి శాలువాతో సత్కరించారు. డీసీసీబీ డైరెక్టర్ బాలురి గోవర్ధన్‌రెడ్డి, నిమ్మల రమణారెడ్డిలతో ఓఎస్‌డీ ఇంటర్మీడియట్, డిగ్రీ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలిసి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఓఎస్‌డీని కలిసిన వారిలో టీపీసీసీ సెక్రటరీ సత్తు మల్లేశ్, దుర్గే నారాయణ ఉన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవితఖైదు

పెంబి: హత్య కేసులో ఒకరికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కరుణకుమార్ జీవితఖైదు విధించినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. మండలంలోని కొలాంగూడకు చెందిన చీకటి చిన్న గంగారాం, టేకం తుకారాం అప్పుడప్పుడు కలిసి మద్యం సేవించేవారు. ఆసమయంలో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. గొడవలను మనసులో పెట్టుకున్న తుకారాం ఎప్పటికైన చిన్న గంగారాంను చంపాలని నిర్ణయించుకున్నాడు. డిసెంబర్ 5, 2018న చిన్న గంగారాం తన పంట చేనులోకి వెళ్లగా పస్పుల గ్రామ శివారులోని చిలుకమ్మ గుడి వద్ద గొడవకు దిగాడు. వెంట తెచ్చుకున్న గొడ్డలితో చిన్న గంగారాంపై దాడి చేసి హతమార్చాడు. మృతుని కుమారుడు రవి పెంబి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సంజీవ్ కేసు నమోదు చేశాడు. సోమవారం 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా.. నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కరుణ కుమార్ నిందితుడు టేకం తుకారాంకు జీవితఖైదుతో పాటు రూ.2వేల జరిమానా విధించారు. పాటు 2వేల రూపాయలు జరిమాన విధించినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



అర్జీలు స్వీకరిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భీంపూర్ మండలం అర్లి–టి గ్రామానికి చెందిన దిలీప్ తనకు సీఆర్టీ ఉద్యోగం ఇప్పించాలని, సిర్పూర్(యూ)మండలం దేవుగూడకు చెందిన సునందన కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని, గుడిహత్నూర్ మండలం గురుజాకు చెందిన గేడం శ్రీనివాస్ త్రీఫేస్ కరెంటు మంజూరు చేయించాలని, ఇంద్రవెల్లి మండలం దొడందకు చెందిన కుంరం జ్ఞానేశ్వర్ వైద్యచికిత్సకు ఆర్థికసాయం అందించాలని కోరారు. పింఛన్, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్సీవో గంగాధర్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు 90 క్వింటాళ్ల పత్తి దగ్ధం

- విద్యుత్ తీగలు వాహనానికి తగలడంతో ఘటన



లారీలో దగ్ధమవుతున్న పత్తి.

నార్నూర్: పత్తి లోడ్‌తో వెళ్తున్న వాహనానికి విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగి 90 క్వింటాళ్ల పత్తి దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామానికి చెందిన ఝాడే భీంరావు, మాయాబాయి దంపతులు తమకున్న మూడెకరాలతో పాటు మరో ఏడెకరాలు కౌలుకు తీసుకుని ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి సాగు చేశారు. ఇప్పటి వరకు మొత్తం 90 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చింది. సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం కావడంతో సోమవారం ఐచర్ వాహనంలో పత్తి నింపుకుని నార్నూర్‌కు వస్తుండగా 11కేవీ విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగి పత్తికి అంటుకున్నాయి. గమనించిన డ్రైవర్ వాహనాన్ని నిలిపి కాలిన పత్తిని బయటకు పడవేసే ప్రయత్నం చేశాడు. మంటలు విస్తరించడంతో గమనించిన మాజీ ఉప సర్పంచ్ షేక్ దాదేఆలి తన ఇంట్లో ఉన్న మూడు బోర్‌వెల్‌ల ద్వారా నీటిని వదలడంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే పత్తితో పాటు ఐచర్ వాహనం క్యాబిన్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆర్‌ఐలు రాథోడ్ కవిత, లాటియ దశరథ్ సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. రూ.6,31,800 నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ సుభద్ర రాథోడ్, రామేశ్వర్, మాజీ సర్పంచ్ చౌహాన్ డిగాంబర్ అధికారులను కోరారు. జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువ ఇంజినీర్ దుర్మరణం

- కంటైనర్ ఢీకొట్టడంతో ఘటన స్థలంలోనే మృతి
- చేతికొచ్చిన కొడుకు మరణంతో తీవ్ర విషాదం



అఖిలేష్ (ఫైల్)



సంఘటన స్థలంలో అఖిలేష్ మృతదేహం

ఆదిలాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువ ఇంజినీర్ దుర్మరణం పాలయ్యాడు. కంటైనర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. రోడ్డు నిబంధనలు పాటించకుండా అతివేగంగా రాంగ్‌రూట్‌లో వచ్చి బైక్‌పై వెళ్తున్న కొస్మెట్టి అఖిలేష్ (29)ను ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే తుదిశ్వాస విడిచాడు. ఈ ఘటన మావల పోలీసు స్టేషన్ పరిధిలో ని బైపాస్ జాతీయ రహదారి 44 బట్టిసావర్గాం శివారులో సోమవారం చోటు చేసుకుంది.

ఏం జరిగిందంటే..

తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఈడబ్ల్యూఐడీసీ) విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా విధులు నిర్వహిస్తున్న అఖిలేష్ విధి నిర్వహణలో భాగంగా బోథ్ మండల కేంద్రానికి బైక్‌పై వెళ్లాడు. తిరుగుప్రయాణంలో బట్టిసావర్గాం శివారు ప్రాంతంలో కంటైనర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మావల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

తీరని శోకం..

ఆదిలాబాద్ పట్టణంలోని పాత హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు జైరామ్–పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. జైరామ్ పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. చేతికొచ్చిన కొడుకు కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ కుటుంబంలో తీరని శోకం నెలకొంది.

జాతీయ సెమినార్‌కు ముస్తాబు

- నేడు భైంసా డిగ్రీ కళాశాలలో హిందీపై సెమినార్
- హాజరు కానున్న వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు



భైంసాలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

భైంసాటౌన్: నిర్మల్ జిల్లా భైంసాలోని గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయస్థాయి సెమినార్‌కు ముస్తాబైంది. మంగళవారం హిందీపై నిర్వహించే సెమినార్‌కు వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు హాజరు కానున్నారు. వివిధ అంశాలపై విస్తృత చర్చద్వారా ఆయా అంశాలపై కళాశాల విద్యార్థులు ప్రేరణ పొంది భవిష్యత్‌లో ఉన్నతులుగా ఎదిగేలా కళాశాల అధ్యాపక బృందం ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో భాగంగా సెమినార్లు నిర్వహిస్తోంది. గతేడాది కళాశాలకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ బాటనీ ప్రొఫెసర్ వెల్మ మధు ఆధ్వర్యంలో 'అటవీ సంపద, వైవిధ్యం, వినియోగం, సంరక్షణ' అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రొఫెసర్లు హాజరై ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. తాజాగా హిందీ విభాగం ఆధ్వర్యంలో 'మానవీయ సంవేదన, సాహిత్య కే విభిన్న స్వర్' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నారు. అధ్యాపక బృందం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉస్మానియా, తిరుపతి ఎస్వీయూ, ఇఫ్లూ(హైదరాబాద్), ధర్మాబాద్, నాసిక్, థానే తదితర యూనివర్సిటీల హిందీ విభాగాధిపతులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

సెమినార్లతో ప్రయోజనం...

ఆయా సబ్జెక్టులపై జాతీయ సెమినార్ల నిర్వహణ ద్వారా కళాశాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని అధ్యాపకులు చెబుతున్నారు. కళాశాలకు సైతం గుర్తింపు పెరుగుతుందని పేర్కొంటున్నారు. కళాశాలకు ప్రస్తుతం న్యాక్ బి గ్రేడ్ గుర్తింపు ఉండగా, భవిష్యత్తులో గ్రేడ్ ఉన్నతీకరణకు ఈ సెమినార్లు దోహదపడతాయని అంటున్నారు. తద్వారా కళాశాలకు నిధులు రావడంతో విద్యార్థులకు అవసరైమన వసతుల కల్పిస్తామని చెబుతున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి సంబంధిత సబ్జెక్టు నిపుణులు ఇక్కడికే వచ్చి అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థులకు ఆయా విషయాలపై సంపూర్ణ అవగాహన పెరుగుతుందని తెలిపారు.

హిందీపై అవగాహన కోసం...



డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిందీ ఆధ్వర్యంలో 'మానవీయ సంవేదన్, సాహిత్య కే విభిన్న స్వర్' అనే అంశంపై జాతీయ సెమినార్ ఏర్పాటు చేశాం. ఈ సెమినార్‌కు వివిధ వర్సిటీల హిందీ విభాగాధిపతులు హాజరు కానున్నారు. హిందీపై విద్యార్థులకు విస్తృత అవగాహనకు ఈ సెమినార్ ఉపయోగపడుతుంది.

– పవన్‌కుమార్ పాండే, అసోసియేట్ ప్రొఫెసర్(హిందీ), జీఆర్పీ డిగ్రీ కళాశాల, భైంసా

ఏర్పాట్లు చేశాం



భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీపై ఒకరోజు జాతీయ సెమినార్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం. గతేడాది జీవ వైవిధ్యంపై సెమినార్ విజయవంతంగా పూర్తి చేశాం. ఉమ్మడి జిల్లాలోనే ఎక్కడా లేనివిధంగా కళాశాలలో జాతీయ సెమినార్ నిర్వహించడం గర్వంగా ఉంది.

– డాక్టర్ ఎం.సుధాకర్, ప్రిన్సిపాల్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముథోల్: మండల కేంద్రంలోని భారత్‌గ్యాస్ గోదాం సమీపంలో భైంసా–బాసర రహదారిపై బైక్ అదుపుతప్పిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భైంసా మండలం ఎగ్గాం గ్రామానికి చెందిన లక్ష్మణ్, లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన విజయ్ సోమవారం సాయంత్రం ముథోల్ నుంచి భైంసా వైపు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి.

చెరువులో పడి ఒకరు మృతి

భైంసారూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాంజ్రి గ్రామానికి చెందిన వినిత్ (27) సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు చెరువు వద్దకు వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఒకరు ఆత్మహత్య

తలమడుగు: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ధనశ్రీ తెలిపిన వివరాల ప్రకారం ఉండం గ్రామానికి చెందిన ప్రశాంత్ (32) ఆర్నెళ్లుగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించినా తగ్గలేదు. జీవితంపై విరక్తి చెందడంతో ఆదివారం పురుగుల మందు తాగి గ్రామ సమీపంలోని పోచమ్మ ఆలయ సమీపంలో పడిపోయాడు. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

చిరుత దాడిలో ఆవు హతం

- పక్షం రోజుల్లో మూడో ఘటన



మృతి చెందిన ఆవు

గుడిహత్నూర్: మండలంలోని చిన్నమన్నూర్ అటవీ ప్రాంతానికి సమీపంలో చేనులో కట్టేసి ఉన్న ఆవుపై చిరుత దాడిచేసి హతమార్చింది. యజమాని రైతు పెందూర్ మారుతి తెలిపిన ప్రకారం ఆదివారం సాయంత్రం పశువులను కట్టేసి ఉంచాడు. రాత్రి సమయంలో చిరుత దాడి చేసి ఆవును చంపేసి సుమారు వంద మీటర్లు లాక్కెల్లి తినేసింది. సోమవారం ఉదయం ఆవు కనిపించక పోవడంతో సమీపంలో వెతుకుతుండగా కళేబరం కనిపించడంతో సర్పంచ్ శంభుకు తెలిపాడు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎఫ్‌బీవో కృష్ణ నాయక్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని సందర్శించారు. చిరుత దాడితోనే మృతి చెందిందని, గతంలో సైతం ధామన్‌గూడ, ముత్నూర్ పరిసరాల్లో ఆవు, గేదెపై దాడి చేసిందన్నారు. కళేబరాన్ని తినడానికి వచ్చే అవకాశం ఉందని, రైతులు, మహిళా కూలీలు అటు వైపుగా వెళ్ల వద్దని సూచించారు. కాపరులు సైతం అటవీ ప్రాంతంలో పశువులను మేపవద్దని కోరారు. మృతి చెందిన ఆవుకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. పక్షం రోజుల్లో వరుసగా ఇదే అటవీ బీట్‌లో మూడు ఘటనలు చోటు చేసుకోవడంతో పరిసర ప్రాంత రైతులు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

'పంచాయతీ భవనం పునర్నిర్మించాలి'

పెంబి: మండలంలోని తాటిగూడ జీపీ భవనాన్ని పునర్నిర్మించాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. జీపీ భవనం నాసిరకంగా నిర్మిస్తున్నారన్నా గ్రామస్తుల ఆరోపణతో సోమవారం పరిశీలించారు. బేస్‌మెంట్ కుంగిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి దశ నుండి నాణ్యతగా నిర్మాణం చేపట్టాలని పీఆర్ ఏఈ అన్వర్, సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. మండల స్పెషల్ ఆఫీసర్ అంబాజీ, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, తాటిగూడ సర్పంచ్ తానాజీ, అధికారులు ఉన్నారు.

పాఠశాల అనుమతులు రద్దు చేయాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: మావల మండల పరిధిలో ని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల అనుమతులను రద్దు చేయడంతో పాటు ప్రిన్సిపాల్ రామ్మోహన్ రావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ సోమవారం డీఈవో ప్రణితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెందిన బాలికను లైంగికంగా వేధించడంతో తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయ డం జరిగిందన్నారు. పాఠశాల అనుమతులను రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జోగు రామన్నను సంఘం నాయకులు శాలువతో సత్కరించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దయాకర్‌రెడ్డి, శశికాంత్, గోలి రాజన్న, గంగాధర్, అశోక్ వైద్య, బాపురావు, దిలీప్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

గురుకృప దినోత్సవానికి హాజరుకావాలి



ఐటీడీఏ పీవోకు ఆహ్వానపత్రం అందిస్తున్న కమిటీ అధ్యక్షుడు జాదవ్‌రెడ్డినాయక్

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామంలోని జాతీయ బంజారాదీక్ష భూమి వద్ద ఈనెల 11న నిర్వహించే గురుకృప దినోత్సవానికి హాజరుకావాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ను గురుకృప ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్ సోమవారం ఆహ్వానపత్రాన్ని అందజేశారు. కమిటీ సభ్యులు రాథోడ్ రమేశ్, నరహరి రాథోడ్ తదితరులు ఉన్నారు.

క్రికెట్ యూనిఫాం పంపిణీ



యూనిఫాంలు అందిస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఫ్రీడం క్రికెట్ క్రీడాకారులకు బీఆర్ఎస్ నేతలు సోమవారం యూనిఫాంలు పంపిణీ చేశారు. ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ అందించిన యూనిఫాంలను పార్టీ కార్యాలయంలో వీటిని అందించినట్లు తెలిపారు. జాన్సన్‌నాయక్ గతంలో వీరికి ఇచ్చిన మాట ప్రకారం యూనిఫాంలు అందించినట్లు పేర్కొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, ఇంద్రవెల్లి ఉప సర్పంచ్ టహరే గణేశ్, బీఆర్ఎస్ నాయకులు సుఫీయన్, కోవ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

తుడుందెబ్బ కార్యవర్గం



ఎన్నికైన సభ్యులతో నాయకులు

ఇచ్చోడ: మండలంలోని కామగిరి గ్రామ తుడుందెబ్బ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అర్క నారాయణ, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా మర్సోకొల రామస్వామి, ఉపాధ్యక్షులుగా మడవి శ్యాంరావు, కినక సురేందర్, జుగనక్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా కాత్లె లక్ష్మణ్, కోశాధికారిగా కురెసింగ రామారావు ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్, డివిజన్ కార్యనిర్వాహణ అధ్యక్షుడు అత్రం మహేందర్, సర్పంచ్ తొడసం భీంరావు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.

నిరుపేద విద్యార్థినికి చేయూత

బేల: మండలంలోని పాలాయితాండ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని ఆడే కృష్ణవేణికి మంచిర్యాల జిల్లా భీమారం తహసీల్దార్ చేయూతనిచ్చారు. ఎన్ఐటీ కశ్మీర్‌లో కెమికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి, గేట్ తెలంగాణలో రెండో ర్యాంకు సాధించింది. ఆ విద్యార్థిని ఉన్నత విద్యనభ్యసించేందుకు ఆర్థికస్తోమత లేదని తెలుసుకున్న తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ సోమవారం రూ.10వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఆమె తండ్రి ఆడే విష్ణుకు ఈ సాయాన్ని అందించారు. సర్పంచ్ చరణ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

తలమడుగు: మండలంలోని కజ్జర్ల జెడ్పీ పాఠశాల విద్యార్థులకు మహిళా సాధికారత ఆధ్వర్యంలో సోమవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిబ్బంది కోటేశ్వర్, కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మికులు తదితర చట్టాల గురించి వివరించారు. హెచ్ఎం కృష్ణారావు, ఉపాధ్యాయులు రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తయ్యేనా?

- పాఠశాలల్లో అసంపూర్తిగా నిర్మాణ పనులు
- ఏడాది గడిచినా పూర్తికాని వైనం
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- పర్యవేక్షణ లేని అధికారులు



తాంసి పాఠశాలలో నిలిచిన అదనపు గది పనులు



నిర్మాణ దశలో నిపాని పాఠశాల అదనపు గదుల పనులు

తాంసి: మనఊరు–మనబడిలో భాగంగా తాంసి, భీంపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది అభివృద్ధి పనులు చేపట్టింది. ఏడాదవుతున్నా ఇప్పటికి పనులు పూర్తికాలేదు. కొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా, మరికొన్ని నిర్మాణదశలో ఉన్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల జాప్యం, నిధుల కొరత కారణంగా పనుల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక నాసిరకంగా పనులు చేపడుతున్నారు.

పాఠశాలలు ఎంపిక..

తొలివిడతలో భాగంగా తాంసి మండల పరిధిలోని తాంసి, వడ్డాడి, బండల్‌నాగాపూర్ పాఠశాలలు, కప్పర్ల జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. భీంపూర్ మండలంలోని నిపాని, పిప్పల్‌కోటి, గుంజాల, వడూర్, బెల్సరీరాంపూర్ పాఠశాలలు, అర్లి(టి), కరంజి(టి) ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో ధనోర, బెల్సరీరాంపూర్, బండల్‌నాగాపూర్, వడ్డాడి పాఠశాలలో చేపట్టిన పనులు చివరి దశలో ఉన్నాయి. తాంసి, నిపాని, అర్లి(టి), గుంజాల, వడూర్, కరంజి(టి) పాఠశాలల్లో పనులు నిలిచిపోయాయి. నిపాని, అర్లి(టి) పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి.

విద్యార్థులకు ఇబ్బందులు

పాఠశాలలో చేపట్టిన పనులు ఏడాదికి పైగా కొనసాగుతుండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిపడా లేక బయటకు వెళ్లాల్సి వస్తోంది. సరిపడా తరగతి గదుల్లేక వరండాలో టీచర్లు బోధించాల్సిన పరిస్థితి. ప్రహరీలు లేక పశువులు, కుక్కలు ఆవరణలోకి వస్తున్నాయి. శిథిలావస్థకు చేరిన గదుల స్థానంలో కొత్తవి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా అదనపు గదుల పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే విద్యార్థులకు అవస్థలు తీరనున్నాయి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి పనులు త్వరగా పూర్తిచేసేలా చూడాలని విద్యార్థులు, తల్లితండ్రులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

తాంసి, భీంపూర్ మండలాల్లోని పాఠశాలల్లో చేపట్టిన పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం. తాంసి, బండల్‌నాగాపూర్, వడ్డాడి, ధనోర, రాంపూర్‌లో దాదాపు పనులు పూర్తిచేశాం.

– శ్రీకాంత్ ఎంఈవో, తాంసి

పనులు పూర్తిచేయాలి



పాఠశాలలో అభివృద్ధి పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. అర్లి(టి) పాఠశాలలో నూతన గదులు పూర్తికాక విద్యార్థులు ఆరుబయట కూర్చుంటున్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పనులు పూర్తిచేయాలి.

– విలాస్ అర్లి(టి) గ్రామస్తుడు

వైద్య ఉద్యోగులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వైద్యఉద్యోగులు

ఆదిలాబాద్: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడే వైద్యారోగ్య శాఖ ఉద్యోగులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల రవీందర్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఒకటవ తేదీన జీతాలు, ఏళ్ల తరబడి పెండింగ్ బకాయిలు, జీవో నెంబర్ 142, ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల క్రమబద్ధీకరణ వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. గౌరవ అధ్యక్షుడు బాబూలాల్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి సంతోష్, నాయకులు సురేష్, సుభాష్, సచిన్, సందీప్, శ్రీధర్, షమీ, రోహిదాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'కార్యకర్తలు అధైర్య పడొద్దు'



కార్యకర్తల కుటుంబీకులతో మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని, అందరికి అండగా ఉంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని పలువురు బీఆర్ఎస్ మహిళా కార్యకర్తల కుటుంబాలను సోమవారం పరామర్శించారు. పార్టీ కార్మిక విభాగ అధ్యక్షురాలు బియ్యాల అనసూయతోపాటు సివిల్‌సప్లై మెంబర్ తులసి, కార్యకర్తలు ఉమా మహేశ్వరితోపాటు రమ కుటుంబాన్ని పరామర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ఎవరూ నిరుత్సాహ పడవద్దని ప్రతిఒక్కరికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట ఇజ్జగిరి నారాయణ, తదితరులు ఉన్నారు.

ఎవడ్రా మనల్ని ఆపేది..!



ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న వాహన చలాన్లు, నంబర్ ప్లేట్స్ లేని వాహనాలను ఆపి తనిఖీ చేసి పత్రాలు పరిశీలించారు. ఈక్రమంలో కుమురంభీం చౌక్‌లో ట్రాఫిక్ పోలీసులు ఓ వాహనంపై ఉన్న పదాలు చూసి విస్తుపోయారు. ఆ వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోగా 'ఎవడ్రా మనల్ని ఆపేది' అని రాసి ఉండటాన్ని చూసి ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్‌తోపాటు అక్కడి పోలీసులంతా కాసేపు నవ్వుకున్నారు. ఆ బైక్‌ను సీజ్ చేసి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇటీవల కాలంలో యువత నెంబర్ ప్లేట్ల స్థానంలో వారికి నచ్చిన కొటేషన్లను రాస్తుండటం గమనార్హం.

క్రిటికల్ కేర్‌కు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న రిమ్స్ డైరెక్టర్‌రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌కు ఇటీవల క్రిటికల్ కేర్ మంజూరైన విషయం తెలిసిందే. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సోమవారం క్రిటికల్ కేర్ కేంద్రం కోసం అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్‌హెచ్ఎం మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ కోసం రూ.23 కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. ఇటీవల నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు. ఆయన వెంట రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్ ఉన్నారు.

ఆధార్ టోకెన్ల కోసం రాస్తారోకో

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో ఈకేవైసీ ఆధార్ కష్టాలు ఆగడం లేదు. ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలు కేంద్రాలకు చేరుకుని బారులు తీరుతున్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆధార్ సెంటర్‌లో టోకెన్లను జారీ చేయనున్నారనే సమాచారంతో ప్రజలు సోమవారం అధికసంఖ్యలో తరలివచ్చి క్యూ కట్టారు. టోకెన్లు అందనివారు స్థానిక వినాయకచౌక్‌లోని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. కాగా, కేంద్రాల వద్ద గంటల తరబడి నిరీక్షిస్తున్న టోకెన్లు ఇవ్వడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసిన నాయకులు



నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నియోజకవర్గ నాయకులు సోమవారం కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన విషయాలపై చర్చించినట్లు తెలిపారు. ఎంపీపీ తుల శ్రీనివాస్, తాంసి, భీంపూర్ జెడ్పీటీసీ సభ్యులు తాటిపల్లి గంగాధర్ రాజు, కుమ్ర సుధాకర్, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, గుడిహత్నూర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిరుమల్ గౌడ్, భూషణ్ ఉన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న అంగన్‌వాడీలు

కైలాస్‌నగర్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం టీఎన్జీవోస్ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అడిషనల్ కలెక్టర్లు శ్యామలాదేవి, కుష్బూ గుప్తా, జిల్లా సంక్షేమాధికారి మిల్కాను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారిని కలిసి నోట్‌పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లతోపాటు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘ బాధ్యులు రాధ, సునంద, కవిత, నర్సమ్మ, సుజాత, విజయ, పోచ్చుబాయి, మీనా తదితరులు ఉన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

నేరడిగొండ:మండలకేంద్రంతోపాటు కుమారి, గుత్పాల గ్రామాల్లో సోమవారం అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. హిందూ సంస్థల నాయకులు, శబరిమాత భక్తులు సోమవారం ఇంటింటికీ అయోధ్య గుడి చిత్రపటం, కరపత్రాలు అందజేశారు.

ఇచ్చోడ: సిరిచెల్మ గ్రామంలో అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. ఉదయం మల్లన్న ఆలయంలో పూజలు అనంతరం మహిళలు మంగళహారతులతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఆలయ పూజారి మహేశ్, గ్రామస్తులు శ్రీధర్‌గౌడ్, రమేశ్, చందు, సాయన్న పాల్గొన్నారు.

జైనథ్: భోరజ్ గ్రామంలోని రామాలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర చేపట్టారు.

అదుపుతప్పి డివైడర్ ఎక్కిన కంటైనర్



ఆదిలాబాద్‌రూరల్: అదుపుతప్పి కంటైనర్ డివైడర్ ఎక్కిన ఘటన సోమవారం మావల పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..గుడిహత్నూర్ నుంచి ఢిల్లీ వైపు వెళ్తున్న కంటైనర్ మావల హరితవనం పార్కు ఎదుట గల జాతీయ రహదారి 44పై గల డివైడర్‌పైకి ఎక్కింది. అదుపుతప్పి ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఆ సమయంలో వాహనదారులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

సుంకిడి వరకు లింక్‌రోడ్డు మంజూరుచేయాలి

- కలెక్టర్‌కు కాంగ్రెస్ నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ: మండలంలోని పొన్న నుంచి సుంకిడి గ్రామం వరకు ఉన్న లింకురోడ్డు మంజూరు చేయాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదు విభాగంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొన్న గ్రామస్తులు మండల కేంద్రానికి చేరుకోవాలంటే ఈ లింకురోడ్డు పూర్తిచేస్తే వారికి చాలా ఉపయోగకరమన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి పనులు ప్రారంభించాలని డీఆర్డీఏ పంచాయతీ రాజ్ ఇంజినీర్ విభాగం అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు సదానందం, సంజీవ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

రైతుబంధు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సంగెం బొర్రన్న

ఇచ్చోడ: రాష్ట్రప్రభుత్వం రైతుబంధు విడుదలతోపాటు రుణమాఫీ ప్రకియను వెంటనే ప్రారంభించాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పశువుల సంతలో సోమవారం ఆయన రైతులతో కలిసి మాట్లాడారు. ఈ ఏడాది రైతులు పండించిన పంటలకు దిగుబడి రాక, మద్దతు ధర లేకపోవడంతో రైతులు నష్టపోయారని తెలిపారు. బ్యాంకు రుణాలు సకాలంలో అందక ప్రైవేట్ వ్యాపారుల నుంచి తీసుకున్న అప్పులు చెల్లించలేకనే రైతులు ఎడ్లజతలు అమ్ముకుంటున్నారని అన్నారు. సమావేశంలో రైతులు బాబు, రోహిదాస్, శివలాల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాజీరావుబాబా సప్తాహ ముగింపు



పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

బేల: మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహ ముగింపు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన వీధుల గుండా బాజీరావు బాబా చిత్రపటంతో పల్లకీ, చిన్నారులను దేవతల రూపంలో అలకరించి భక్తులు ఊరేగింపు చేపట్టారు. తర్వాత బాజీరావు బాబా ఆలయ ఆవరణలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు. చివరగా కాలదహీ హండిని చేపట్టి, అన్నదానం నిర్వహించారు. సర్పంచ్ మినక పుష్పలత సుధాంరెడ్డి, ఎంపీటీసీ నగేశ్‌రెడ్డి, ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ లక్ష్యంగా పోరాటాలకు సిద్ధం కావాలి



ఎన్నికైన వారిని సన్మానిస్తున్న నాయకులు

ఇచ్చోడ: ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా మాదిగ విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర సెక్రెటరీ బైరిపోగు శివకుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మాదిగ విద్యార్థుల సదస్సులో ఆయన మాట్లాడారు. వర్గీకరణ ద్వారానే విద్య, ఉద్యోగ రాజకీయ సంక్షేమ రంగాల్లో మాదిగలకు సమాన వాటా దక్కుతుందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెలి మల్లేశ్, ప్రధాన కార్యదర్శి గణేశ్, నాయకులు సుభాష్, రాజేశ్వర్, రవి, అన్నెల లక్ష్మణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక..

ఎంఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసుల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా రొడ్డ రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా దుబాక శ్రీకాంత్, కార్యదర్శిగా కల్లెపెల్లి నందకిషోర్‌ను ఎన్నికయ్యారు.

భగీరథ పనులు త్వరగా పూర్తిచేయాలి



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలో నిర్మిస్తున్న మిషన్ భగీరథ పనులు త్వరగా పూర్తిచేయాలని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృపాకర్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ తలమడుగు, భీంపూర్, తాంసి మండలాల్లో గ్రామాలకు భగీరథ ద్వారా అందించే నీరు గ్రామాలకు సరిగా నీరందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరగా, ఇంజినీర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఉర్దూ భవన్ అభివృద్ధి చేయాలని ధర్నా

కైలాస్‌నగర్: పట్టణంలో శిథిలావస్థకు చేరిన ఉర్దూ భవన్‌ను అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ మైనార్టీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్లరిబ్బన్లు ధరించి ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

సన్మానం

ఆదిలాబాద్: నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన కొండూరి గంగాధర్ ఇటీవల ఎన్నికయ్యారు. విద్యానగర్ కాలనీవాసులు సోమవారం ఆయన్ను సన్మానించారు. కౌన్సిలర్ కలాల శ్రీనివాస్ ఉన్నారు.

పట్టుదలతో చదవాలి

ఇంద్రవెల్లి: విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయం సాధిస్తారని ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకుడు దుర్వ సంతోష్ అన్నారు. మండలంలోని ముత్నూర్ యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆయన నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు.

చెక్కు అందజేత

జైనథ్: మండలంలోని బాలాపూర్‌కు చెందిన సుభాష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను యాదవ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు కిషన్‌యాదవ్ సోమవారం పరామర్శించి రూ.5 వేల చెక్కును అందించారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: శీతాకాలంలో వృద్ధులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్వీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఎస్.వామన్‌రావ్ అన్నారు. ఎస్వీఆర్ ఫౌండేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా మావల మండలంలోని కేఆర్కే కాలనీలో గల వృద్ధాశ్రమంలో సోమవారం పండ్లు పంపిణీచేశారు. రవి, నితిశ్, చక్రపాణి, రోహిత్ ఉన్నారు.

నేడు పట్నాపూర్‌కు ఎంపీ రాక

బోథ్: మండలంలోని పట్నాపూర్‌కు ఎంపీ సోయం బాపూరావ్ మంగళవారం రానున్నట్లు సర్పంచ్ పంద్రం సుగుణ తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

శబరికి బయల్దేరిన అయ్యప్పలు

తాంసి:తాంసికి చెందిన అయ్యప్ప స్వాములు రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. గురుస్వాములు 35 మందికి ఇరుముడి కట్టారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు పూజలు తర్వాత అనంతరం వాహనాల్లో శబరికి వెళ్లారు. శ్రీనివాస్, సంతోష్, నరేశ్‌రెడ్డి, దేవారెడ్డి, ప్రశాంత్, శివ, సతీశ్, వసంత్ ఉన్నారు.